జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 4 నవంబర్ 2024
www.ntnews.com



రాసలీలా వైభవం-3

# నీవే నా పతియు గతియు..

**'బాలానాం రోదనం బలం'- పసిపిల్లలకు ఏడుపే ఏడుగడ- అసి (కత్తి) వంటి ఆయుధం. భక్తులకు కూడా రోదనమే ఓదనం- సాదం, ఆహారం! భగవత్ ప్రాప్తికి అమోఘమైన సాధనం! ఆక్రందన (విషాద) యోగం లేనిదే నందనందనుని- గోవిందుని ప్రసాద (అనుగ్రహ) ప్రాప్తి లేదు. ధనంజయుని- అర్జునుని విషాదమే కదా 'గీతా' ప్రాసాదానికి పటిష్ఠమైన పునాది! దైవం కోసం, ధర్మం కోసం ఏడిస్తే ఆ ఏడుపు యోగం అవుతుంది. ప్రసవ వేదన లేక పుత్ర ప్రాప్తి లేనట్లు విషాదయోగం లేక భగవత్ సాక్షాత్కారం లేదు. గోపికల విలాపం- విషాదం వారికి మహాయోగమయింది.**


మన పోతన మధురిమ 187 వ భాగం

శుకయోగి రాజయోగి పరీక్షిత్తుతో– నరపతీ! పరమాత్మని పరుషమైన పలుకులు విని, విరహాగ్ని నుండి వెడలిన వేడి నిట్టూర్పులు సోకగా ఆ గోపికల పెదవులు వట్టి– ఎండి పోయాయి. వారి వదనారవిందాల అందమంతా కందిపోయింది. నిరాశ చెందారు. అడలడి (అలజడి) వల్ల మాటలు తడబడగా భయపడి వల్లవ– గొల్ల పడతులందరూ పాదాలతో నేల వ్రాస్తూ ఇలా అన్నారు...

**మ|| 'అకటా నమ్మితి మేము, క్రూరుడన నిన్నర్హంబె? మా యిండ్లలో**
**సకల వ్యాప్తులడించి నీ పద సరోజాతంబు లర్చింప జి**
**క్కక యేతెంచితి, మీశుడాఢ్యుడవు మోక్షాసక్తులం గాచు పో**
**లిక గావందగు గావవే? విడువ మేలే కాంతలన్ భ్రాంతలన్'**

అయ్యో! కన్నయ్యా! మేము నిన్నే నమ్ము కున్నాం. క్రూరుడవని నిన్ననడం యోగ్యం కాదు– చెల్లదు. మా ఇళ్లలోని అన్ని విషయాలను– వ్యవహారాలను, వ్యాపకాలను (ఇంద్రియ వ్యాపారాలను) దిగవిడిచి– వదలి, మా మగవారు వారించినా వెరవక నీ పదరాజీవాలు– పద్మాలు సేవించడానికి తప్పించుకొని వచ్చాము. నీవు సర్వేశ్వరుడవు, సర్వసంపన్నుడవు. ముముక్షువులను– మోక్ష కాంక్షగలవారిని రక్షించు విధంగా ఓ అధోక్షజా! కావదగిన మమ్ము కాపాడు. వేదురు (వలపు) గొన్న వెలదులను– మమ్ములను విడిచిపెట్టడం, వెనుదిరిగి పొమ్మనడం నీకు విధాయకం– న్యాయం కాదు. పతులను, పుత్రులను, బంధువులను అనుసరించడమే సతులకు పరమధర్మమని ఉపదేశించావు. 'ధర్మో ధర్మ విదుత్తమః'– నీవు ధర్మ స్వరూపుడవు. ధర్మవేత్తలలో ఉత్తముడవు కూడా. నీవే ఆలోచించు– అన్ని ధర్మాలకు, ఉపదేశాలకు అంతిమ గతి, లక్ష్యం నువ్వే కాదా? 'నీవే తల్లివి తండ్రివి| నీవే నా తోడు నీడ నీవే సఖుడౌ| నీవే గురుడవు దైవము| నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా!' పతి పుత్రాది అన్ని రూపాలలో అప్రతిహతంగా ప్రకాశించే నిన్నే, ఆ పతి, పుత్రాదికంగా ఎన్ని– భావించి, సేవించడం అన్యాయమంటావా స్వామీ? సమస్త దేహధారులకు– ప్రాణులకు నీవే ప్రియతమ బంధువు ఆత్మవు కదా! నీవు లేక పతులున్నారా? పుత్రులున్నారా? అత్తమామలున్నారా? బంధు భ్రాతలున్నారా? 'జారు జేర జనదు చారు ముఖికి'– 'వర (శ్రేష్ఠ) కాంత ఎట్టి స్థితిలోనూ పరపురుషుని చేర రాదు' అని ఆనతి ఇచ్చావే! స్వ– పర భేదం లేని సర్వ స్వరూపుడవైన ఓ పరమపురుషా! నీవు పర పురుషుడవా? సర్వ భూతములలో చైతన్య జ్యోతివై 'నేను' అను ప్రజ్ఞగా భాసించు– వెలుగు నీవు లేకపోతే మా మేనులు– దేహాలు మనగలవా? అపరంజి– బంగారు లేని ఆభరణాలు ఉంటాయా అచ్యుతా? నీకై తల్లడిల్లుతున్న మమ్ములను ఒల్ల– ఇష్టపడనని పలకడానికి నీ ఉల్లం (హృదయం) ఎందుకని జంకడం లేదు పంకజాక్షా?

**సీ|| 'నీ పాద కమలంబు నెమ్మి డగ్గఱ గాని తరలిపోవంగ బాదములు రావు**
**నీ కరాబ్జంబులు నెఱి నంటితివ గాని తక్కిన పనికి హస్తములు చొరవు**
**నీ వాగమృత ధార నిండ గ్రోలగగాని చెవులన్య భాషల జేరి వినవు**
**నీ సుందరాకృతి నియతి జూడగ గాని చూడవన్యంబుల జూడ్కి కవలు**
**నిన్ను కాని పలుక నేరవు మా జిహ్వలొల్ల ననుచు బలుక నోడనీవు**
**మా మనంబులెల్ల మఱపించి దొంగిలితేమి సేయువార మింక గృష్ణ!'...**

కృష్ణా! నీ పాద పద్మాలను ప్రీతితో చేరడానికే కాని మరలిపోవడానికి మాకు కాళ్లు రావు. నీ కర కమలాలను పట్టుకోవడానికే తప్ప వేరు పనులకు మా చేతులు పూనుకోవు. నీ వచన సుధారసం తనివి తీర గ్రోలుటకే కాని, ఇతరమైన వ్యర్థపు మాటలు వినడానికి మా చెవులు సుతరాం ఒప్పుకోవు. నీ దివ్య మంగళ సుందర రూపాన్ని కరువుతీర చూచి ఆనందించుటే తప్ప మా కన్నులు ఇతరములను కనుటకు ఇష్టపడవు. నీ నామ రూప గుణ ధామ లీలా విభూతి కాంతులనే కాని మరి దేనినీ మా నాలుకలు పలుకనేరవు. 'మనోహి హేతుః సర్వేషాం ఇంద్రియాణాం ప్రవర్తనే'... ఇంద్రియాలు ఆయా విషయాలలో– క్రియలలో పూనుకొనడానికి మనస్సే కారణం. గృహాసక్తమైన మా మనసునే కదా హరీ! నువ్వు అపహరించింది? ఇక మా ఇళ్లకి ఎలా వెళ్లగలం? వెళ్లి ఏమి చెయ్యగలం? సర్వజీవులకు స్వధర్మం– పరమధర్మం పరమాత్మ ప్రాప్తి. ఇతరమైన దేహ ధర్మాలు, గేహ ధర్మాలు, స్నేహ ధర్మాలు అన్నీ లౌకిక– పర ధర్మాలు. 'గతిర్భర్తా ప్రభుః సాక్షీ' (గీత)– జగత్పతీ! నిజమైన భర్త లభించగా ఛాయలైన– నీడలైన భర్తల సేవ చెయ్యమంటావా?

'ప్రేమ విద్యలో గోపలేమ (భామ)లను మించిన వారు లేరు. వారిది మధుర ప్రేమ. భగవంతుని– కృష్ణుని ఐశ్వర్య శక్తి కన్నా మాధుర్య శక్తి మిన్న– అధిక మహిమ కలది. లౌకిక దావాగ్ని, బడబాగ్ని కన్నా, వైదిక (యజ్ఞీయ) అగ్ని కన్నా, మహాయోగుల యోగాగ్ని కన్నా గోపికల ప్రేమ మయ అగ్ని– విరహాగ్ని బహుగొప్పది'– అని మూల్పూరు శాస్త్రుల వారి వ్యాఖ్యానం. గోపికలు అన్నారు.. మా వియోగాగ్నికే మా దేహాలను ఆహుతి చేస్తాము. 'మనోజాగ్నిచే బొగులం జాలము, కౌగిలింపుము మముం బుణ్యంబు పుణ్యాత్మకా!' ఓ పుణ్యపురుషా! పాపనాశనా! ఈ భావజు (మన్మథుని) తాపం ఓపలేకున్నాము. మాకు నీ పరిష్వంగ– ఆలింగన సౌభాగ్యాన్ని ప్రసాదించి పుణ్యం కట్టుకో. ప్రాణేశ్వరా! నీ పాదాల మీద ఒట్టు. నీ అధర సుధా రసధారలు కురిపించి మా మన్మథాగ్నిని చల్లార్చవేని, నీ విరహాగ్ని జ్వాలలలో భస్మమై పోయి నిన్నే స్మరిస్తూ నీ పాదద్వయాన్నే పొందుతాము.

గోపికలు ఆలింగనం ఆశించినా, అధరామృతం అపేక్షించినా, అంగసంగం అభిలషించినా అంతా అద్వైతమే! రాసలీలలో త్రిపుటి (రస్య, రసిక, రసాలు) కృష్ణమయం. రస్యం– ఆస్వాదింపబడేది, రసికుడు– ఆస్వాదించేవాడు 'రసోవై సః'– రసస్వరూపుడైన పరమాత్మే!

**క|| 'తరుమృగ ఖగ గోగణములు**
**కరమొప్పెడు నిన్ను గన్న గానము విన్నం**
**గరగి పులకించు నబలలు**
**గరగరె నిను గన్న నీదు గానము విన్నన్'..**

గోపికలు– భువనసుందరా! నీ భవ్య రూపాన్ని చూచినా, నీ మధుర గానం విన్నా, ద్రుమాలు– చెట్లు, మృగాలు, ఖగాలు– పక్షులు, నగాలు– కొండలు, గో సమూహాలు కరగి పులకించి పోతాయి. మరి, ఓ మురవైరీ! ఈ తరుణీ మణులు నిను కని, నీ గీతం వినీ కిలికించితాల (శృంగార చేష్టా విశేషాలు)తో అంచితం(ఒప్పిదం)గా ద్రవించిపోరా? పురుష భూషణా! ఈ పరుష వచనాలు చాలించి మా మొర ఆలించు దొరా! నీ పాద దాస్య మిచ్చి మమ్ము పాలించు. కంసారీ! సంసారంతో పొత్తు కుదరక పోతే కత్తిరించి పారేయడమే తక్షణ కర్తవ్యం. మహాత్మా! మాకెవ్వరి పొత్తూ వద్దు. నీవు కరుణించి హత్తుకొనకుంటే మేమెలా మనగలం? దర్పకుడు– మన్మథుడు దయమాలినవాడు. మమ్ములను బతకనిస్తాడా?


తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

**ఆ|| 'అమరుల గాచిన హరి క్రియ**
**గమలేక్షణ! నీవు నేడు కరుణ నభయ హ**
**స్తము మా యురముల శిరముల**
**బ్రమదంబున నిడుము మూర్ఛ పాల్పడకుండన్'..**

కమలాక్షా! కమలాపతి శ్రీహరి అమరు (దేవత)లను కరుణించి కాపాడునట్లు, మేము మూర్ఛపాలు గాకుండా ఇప్పుడే దయతో నీ అభయహస్తాన్ని తపించే మా వక్షఃస్థలంపైనా, తలలపైనా ప్రేమతో ఉంచి రక్షించు. (సశేషం)

# అసూయ వద్దు

ఇస్లాం బోధ

**అసూయ** మనిషికి ఉండకూడని లక్షణం. ఒకరికి దక్కిన దైవానుగ్రహాన్ని చూసి ఓర్వలేనితనంతో అది వారికి దక్కకుండా నశించాలి అని కోరుకోవడమే అసూయ అంటారు ఇమామ్ ఇబ్నుల్ ఖయ్యిమ్ (రహ్మ). అసూయ, ఈర్ష్య పెద్ద పాపాల కోవకు చెందినవి. అసూయ అగ్ని వంటిది. ద్వేషమూ అంతే. ఏ కర్ర నిప్పు ఆ కర్రనే కాల్చినట్టు, అసూయ, ద్వేషాలు వాటిని చూపిన వారినే దహిస్తాయి. ఈర్ష్య మూలంగానే షైతాన్ తొలిసారిగా అల్లాహ్‌ను ధిక్కరించాడు. ఖాబిల్ తన సోదరుడైన హాబిల్‌ని అసూయతోనే హత్య చేశాడు. దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) సోదరులు ఆయన పట్ల చేసిన చెడు వ్యవహారానికి అసలు కారణం ఈ అసూయే. అందుకే అసూయకు అందరూ దూరంగా ఉండాలి. మనకు కావాల్సిన వాటిని స్వశక్తితో సంపాదించుకోవాలి. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు.. 'అసూయకు దూరంగా ఉండండి. ఎందుకంటే అగ్ని కట్టెలను భస్మీపటలం చేసినట్లే.. అసూయ సత్కార్యాలను హరించి వేస్తుంది. ఇతరులను చూసి అసూయ పడొద్దని, తోటి సోదరులతో మూడు రోజుల కంటే ఎక్కువగా (అయిష్టంతో) మాట్లాడకుండా ఉండొద్దని ప్రవక్త (స) హితోపదేశం చేశారు.



ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

# పాపాన్ని కడిగేసే పుణ్యఫలం

**పరాచః కామా ననుయన్తి బాలాః**
**తే మృత్యోర్యన్తి వితతస్య పాశమ్|| (కఠోపనిషత్తు 4-2)**

'బాలురు (అజ్ఞానులు) బాహ్యములైన సుఖాల వెంట పరుగెత్తుతూ విశాలమైన మృత్యు పాశానికి తగులుకుంటున్నారు..' అని పై శ్లోకానికి భావం. బుద్ధికి తోచిందల్లా సుఖమే అనుకొని నడుచుకుంటే పాపాలు గుట్టలుగా పెరిగిపోయి చిట్టచివరికి ఘోర నరక బాధల పాలవుతారు.

**కిల్బిషం హి క్షయం నీత్వా**
**రుచిరం చైవ చింతయేత్|| (అమృతనాదోపనిషత్తు)**

'పాపాన్ని నశింపజేసికొని ఉత్తమమైన ఆత్మను గురించి చింతన చేయాల'ని శ్లోక భావం. పాపాలను నశింపజేసుకుంటే తప్ప ఆత్మ చింతన కుదరదు. కొందరు అదృష్టవంతులకు తపోనిష్ఠులు తమ పుణ్యఫలాన్ని ధారపోస్తారు. అలా వారి ఆత్మోన్నతి సుగమం అవుతుంది.

కర్కశ (నిష్ఠుర) అనే యువతి భర్తను తిడుతూ కొడుతూ అవమానించేది. అత్తమామలను లెక్కించేది కాదు. అక్రమ సంబంధాలకూ తెగబడింది. ఒక విటుడు 'నీ మగడు లేకపోతే మనమెంతో సుఖించవచ్చు' అంటాడు. దాంతో ఆమె తన భర్తను బండ రాతితో మోది చంపి, పాడుబడ్డ బావిలో పడవేస్తుంది. కోడలు హింస భరించలేక అత్తమామలూ ఎక్కడికో వెళ్లిపోతారు. కర్కశ మరింత బరితెగిస్తుంది. విటులను ఆకర్షించి వారి నుంచి విరివిగా డబ్బులు దండుకునేది. ఏండ్లు గడిచాయి. కర్కశ వయసు పైబడింది. అనేక వ్యాధులతో తిండి కూడా కరువై దిక్కులేనిదై చనిపోయింది. యమభటులు ఆమెను నరకానికి తీసుకువెళ్లారు. పర పురుషుల కౌగిలింతలకు మరిగినందుకు మండే ఇనుప స్తంభాన్ని కౌగిలించుకోమన్నారు. భర్తను బండరాయితో మోదినందుకు ముండ్ల గదతో తల బద్దలు కొట్టారు. విపరీతంగా బాధించారు. ఆమె చాలాసార్లు కుక్కగా జన్మించింది. 15వ జన్మలో కళింగదేశంలో కుక్కగా పుట్టినప్పుడు ఒక పుణ్యాత్ముడు కార్తిక సోమవార వ్రతాన్ని ఆచరించాడు. శ్రద్ధగా రుద్రాభిషేకం నిర్వహించి బలి ఆహారాన్ని ఇంటి బయట ఉంచాడు. కుక్కగా పుట్టిన కర్కశ ప్రదోషకాలంలో అటుగా వచ్చి ఆ బలి ఆహారాన్ని భుజించింది. వెంటనే శునకానికి పూర్వస్మృతి వచ్చింది. 'అయ్యా! రక్షించు' అని అరిచింది. ఆయన విస్తుపోయాడు. కుక్క మనుష్య భాషలో 'కామంతో కళ్లు మూసుకుపోయి ప్రవర్తించాను. భర్తను హత్య చేశాను. అనేకమంది విటులతో కులికాను. పతితనయ్యాను. నన్ను ఉద్ధరించు' అని ప్రార్థించింది. కర్కశ దీనస్థితికి చలించిపోయిన ఆ గృహ యజమాని కార్తిక సోమవార వ్రత పుణ్యాన్ని కుక్కకు ధారపోశాడు. తక్షణమే ఆ శునకం దివ్య తేజస్సు కలిగిన వనితగా మారి కైలాసానికి వెళ్లిపోయింది. పైన పేర్కొన్న రెండు ఉపనిషత్ వాక్యాలకు.. కర్కశ కథ అద్దం పడుతుంది.


ఉపనిషద్ సారం

... డా|| వెలుదండ సత్యనారాయణ

'న కార్తిక సమో మాసః' అని ఆర్యోక్తి. ఈ మాసంలో చేసే పూజ, అర్చన, దానం, జపం, స్నానం, అభిషేకం అత్యంత విశేషమైన ఫలితాన్ని ఇస్తాయి. కార్తిక మాసానికి కౌముది మాసం అనే పేరు కూడా ఉంది. కౌముది అంటే వెన్నెల అని అర్థం. ఆశ్వయుజ, కార్తిక మాసాలు శరదృతువు. వెన్నెల నిండుగా కాస్తుంది. వీటికి తోడు కార్తికం నెల రోజులూ ఇళ్లలో, దేవాలయాల్లో దీపాలు వెలిగించడం, ఆకాశదీపం పెట్టడం వల్ల ఎక్కడ చూసినా వెలుగులే కనిపిస్తాయి. ఈ కోణంలో కార్తికానికి కౌముది మాసం అనే పేరు వచ్చి ఉండవచ్చు.

# కార్తిక వైభవం

**కార్తికంలో** నెల రోజులు నక్త వ్రతం ఆచరించే సంప్రదాయం ఉంది. నక్తం అంటే పగలంతా ఉపవాసం చేసి, రాత్రి వేళ భోజనం చేయడం. పూర్తిగా నెల రోజులు వ్రతం చేయలేని వారు కనీసం సోమవారాలు, పౌర్ణమి లాంటి పర్వదినాల్లో అయినా ఆచరిస్తే మంచిది. ఆశ్వయుజ, కార్తిక మాసాల్లో మనుషుల జఠరాగ్ని మందగిస్తుంది. ఈ కారణం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. ఈ విధమైన ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండటానికి నక్త వ్రతం పేరుతో భోజన నియమాన్ని మన పెద్దలు ఏర్పాటుచేశారు.

## ప్రతి క్రతువూ ప్రత్యేకం..

**శివనామ స్మరణ:** కార్తిక మాసంలో చేసే శివ నామ స్మరణ అనంత ఫలితాన్ని ఇస్తుంది. అప్రయత్నంగా శివ నామస్మరణ చేసినా.. శివలోక సాయుజ్యం కలుగుతుంది. ఇందుకు ఉదాహరణగా స్కంద పురాణంలో సుమిత్రా వృత్తాంతం చెప్పుకోవచ్చు. అనేక తప్పులు చేసినా, చివరికి అప్రయత్నంగా బిల్వదళార్చన, శివనామ స్మరణ చేయడం వల్ల సుమిత్రకు శివ సాయుజ్యం కలిగింది. శివ నామస్మరణ ప్రాముఖ్యం అంతటి విశేషమైంది.

**నదీస్నానం:** ఈ మాసం నదీస్నానం చేస్తే దైవానుకూలత సిద్ధిస్తుంది. సూర్యోదయానికి పూర్వమే నిద్ర లేచి, కాలకృత్యాలు ముగించుకుని, ఇంట్లో ముందుగా స్నానం చేసి, ఆ తర్వాత నదికి వెళ్లి, సంకల్పం చెప్పుకొని స్నానం చేయాలి. అందుబాటులో నది లేకపోతే కాలువ, సరస్సు, చెరువు లేదా బావి దగ్గర అయినా విధి ప్రకారం స్నానం చేయాలి. ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**దీపారాధన:** కార్తిక మాసం 30 రోజులు ఆలయానికి వెళ్లి, నియమ నిష్ఠలతో శివుణ్ని స్మరించి, దీపారాధన చేయాలి. ఉభయ సంధ్యల్లోను దీపారాధన చేయవచ్చు. అలా చేయలేనివారు కనీసం ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి, సోమవారాల్లో నియమం ప్రకారం ఉపవాసం చేసి, సాయంత్రం శివాలయానికి వెళ్లి దీపారాధన చేయాలి. కార్తిక పూర్ణిమ రోజున పగలంతా ఉపవాసం చేసి, సంధ్యవేళ శివాలయానికి వెళ్లి 365 వత్తులతో దీపం వెలిగిస్తే శివానుగ్రహం కలుగుతుందని పెద్దల మాట.

**దీపదానం:** ఇంట్లో కన్నా తులసి, ఉసిరి చెట్టు సమీపంలో చేసే దీపదానం శ్రేష్ఠమైంది. దీనికన్నా ఆలయంలో చేసే దానం ఉత్తమం. నదీ తీరంలో గానీ, సముద్ర తీరంలో గానీ చేసే దానం అంతకన్నా ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది. కార్తిక బహుళ చతుర్దశి ఇందుకు శ్రేష్ఠం. కుదరని పక్షంలో పౌర్ణమి లేదా మరే రోజైనా చేయవచ్చు.

**ఆకాశదీపం:** కార్తికమాసంలో ప్రతి శివాలయంలోను ఆకాశదీపం ఉంచుతారు. స్వయంగా ఆకాశదీపం పెడితే అంతకన్నా ఉత్తమ అర్చన మరొకటి ఉండదని పెద్దల మాట. కుదరని పక్షంలో కనీసం ఆకాశదీపాన్ని చూసి, భక్తిభావంతో నమస్కరించినా విశేష ఫలితాలు కలుగుతాయి. ఆకాశదీప దర్శనం వల్ల మోక్షసిద్ధి కలుగుతుందని విశ్వాసం.

**వ్రతాలు:** క్షీరాబ్ధి ద్వాదశి వ్రతం, సత్యనారాయణ వ్రతం, కేదారేశ్వర వ్రతాలు చేసుకోవడానికి కార్తిక మాసం అత్యంత శ్రేష్ఠమైంది. ఆయా ప్రత్యేక తిథుల్లో వీటిని చేసుకోవాలి. లేదంటే వీలును బట్టి చేసుకోవచ్చు.

**వనభోజనం:** కార్తిక మాసంలో చేసే వనభోజనం అత్యంత పవిత్రమైంది. వేడుక తీరులో కాకుండా ఆధ్యాత్మిక దృష్టితో వనభోజనం చేయాలి. శాస్త్రనియమాల ప్రకారం ఉసిరి చెట్టు వద్ద మహావిష్ణు సాలగ్రామం ఉంచి పూజలు చేయాలి. అనంతరం బ్రాహ్మణ సమారాధన చేసి, పురాణ శ్రవణం చేయాలి. దీనివల్ల విష్ణు సాయుజ్యం లభిస్తుంది.

## అన్ని వారాలూ విశేషమే..

**ఆదివారం:** కార్తిక మాసం ఆదివారాల్లో సూర్యోపాసన, అర్చన చేయడం ఎన్నో ఉత్తమ ఫలితాలు కలిగిస్తాయి. ఆదిత్యహృదయ స్తోత్రం పారాయణ చేసి, తైలం, నేతవస్త్రాలు దానం చేయాలి. దీని వల్ల కుష్ఠు మొదలైన రోగాలు తొలగిపోతాయి. మిరియాలు, పాలు దానం చేస్తే క్షయరోగం నివారణ అవుతుంది. దీపాలు, ఆవాలు దానం చేస్తే అపస్మారం, మానసిక వ్యాధులు నశిస్తాయి.

**సోమవారం:** కార్తిక సోమవారాల్లో చేసే శివారాధన, అభిషేకం విశేష ఫలితాలు కలిగిస్తాయి. రోజంతా ఉపవాసం ఉండి, సాయం వేళ శివాలయాన్ని సందర్శించి, అర్చనాది కైంకర్యాలు జరిపించుకుని, ఇంటికి వచ్చి బ్రాహ్మణునికి భోజనం పెట్టాలి. దీనివల్ల మహాదారిద్ర్య వినాశనం జరుగుతుంది.



**మంగళవారం:** కుమారస్వామిని పూజించాలి. సుబ్రహ్మణ్య స్తోత్రాలు పఠించాలి. బ్రహ్మచారులకు భోజనం పెట్టాలి. దీపం, ఘంట దానం చేయాలి. దీనివల్ల వాక్సిద్ధి కలుగుతుంది.

**బుధవారం:** విష్ణువును అర్చించి, పెరుగన్నం నివేదన చేయాలి. దానిని ప్రసాదంగా ఇతరులకు పంచిపెట్టాలి. దీనివల్ల సత్సంతాన యోగ్యత కలుగుతుంది.

**గురువారం:** గురువులను, పండితులను అర్చించాలి. దక్షిణామూర్తి, దత్తాత్రేయ, హయగ్రీవ, సరస్వతీమాతకు అర్చనలు జరపాలి. తేనె, బంగారం, నెయ్యి దానం చేయాలి. దీనివల్ల సకల భోగాలు సిద్ధిస్తాయి.

**శుక్రవారం:** గణపతిని పూజించాలి. గంధం, పుష్పాలు, అన్నదానం చేయాలి. దీనివల్ల ఆటంకాలు తొలగుతాయి. శక్తిగలవారు సువర్ణం, రజతం దానం చేస్తే సత్సంతానం కలుగుతుంది.

**శనివారం:** దిక్పాలకులను అర్చించాలి. నాగదేవతలు, ధన్వంతరి, అశ్వినీదేవతలను కూడా పూజించాలి. ఈ రోజున ఉప్పు, ఇనుము, నూనె, మినుములు, శొంఠి, అల్లం, మిరియాలు దానం చేయాలి. దీనివల్ల రోగాలు తొలగుతాయి. అపమృత్యు భయం ఉండదు.

**పుణ్యప్రదమైన** కార్తికంలోనే యోగనిద్రలో ఉన్న శేషశాయి మేల్కొంటాడు. వైకుంఠద్వారం తెరుచుకునే ఉత్తరాయణ పుణ్యకాలం సమీపిస్తుంది. అంటే మానవుడికి మోక్షమార్గం తెరుచుకుంటుందని అర్థం. అందువల్ల ఈ మాసంలో ఏ వ్రతం, అర్చన.. మరే ఇతర దైవ సంబంధ కార్యక్రమం చేసినా భగవదనుగ్రహం కలుగుతుంది అనడంలో సందేహం లేదు.

... డా|| కప్పగంతు రామకృష్ణ

# ప్రార్థన శ్రేష్ఠం

క్రీస్తు సందేశం

**అందరి** సమస్యలూ బాగా తెలిసిన వాడు దేవుడు! అయినా విశ్వాసులు అభ్యర్థించే శైలిని బట్టి దేవుడి అనుగ్రహం ప్రాప్తిస్తుంది. 'ఆయన ఎంత రహస్యంగా ఉన్నా, ఇంకెంత రహస్యంగా విన్నా, మనల్ని ఆదుకోవాలని తెలిసినా, మన దగ్గరి నుంచి విన్నపం వినయంగా పోవాల్సిందే' (మ 6:4). రకరకాల వేషధారణలతో లొడలొడా వాగకుండా.. మనోభాషణం సాగించాలని, దేవునితో వ్యక్తిగతంగా ముఖాముఖి సంభాషణ సాగించాలని ప్రభువు బోధ. దీనికి ప్రార్థన అనే పదాన్ని ప్రయోగించారు. ప్రార్థనలో దేవుడి ఉనికిని స్తుతించాలి. ఆయన మనకు చేసిన దానికి కృతజ్ఞత చూపాలి. 'నీవు చెప్పిన ఆజ్ఞలు జవదాటకుండా, నీ చిత్తానుసారమే నడచుకుంటామయ్యా, అందుకు అనుదినమూ నైతిక బలం అందించుమయ్యా' అని ఆయన ముందు వేడుకోవాలి. 'ఈ ప్రార్థనా దీపం హృదయంలో వెలగాలి. ఆ కాంతి మనల్ని చీకటిలోంచి వెలుగులోకి నడిపిస్తుందన్న నమ్మకం ఉండాల'ని ప్రార్థన రహస్యాన్ని ప్రభువు విశదీకరించాడు.



... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024